క్లుప్తంగా

దేవరపాళెంలో ప్రత్యేక వైద్య శిబిరం



నెల్లూరు సిటీ: సౌత్ మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దేవరపాళెం గ్రామంలో వైద్యాధికారి అర్షద్ హుస్సేన్, డాక్టర్ యూసఫ్‌ల ఆధ్వర్యంలో 'స్వస్త్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్' ప్రత్యేక వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్షద్ హుస్సేన్ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న వైద్య శిబిరాల వల్ల మహిళల్లో వివిధ రకాలైన వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో 113 మంది వైద్య చికిత్సలు చేయించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బట్టేపాటి అశోక్, పెంచలయ్య, రసూల్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది మృతి



శ్రీనివాసులు(ఫైల్)

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది చింతగుంట శ్రీనివాసులు (48) అనారోగ్యంతో స్థానిక నెల్లూరు హాస్పిటల్‌లో సోమవారం మృతిచెందారు. ఈ క్రమంలో ఆయనకు ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు, అయ్యపరెడ్డి, జల్లి పద్మాకర్ తదితరులు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కలెక్టర్‌కు వినతి

నెల్లూరురూరల్: పేదల గృహ నిర్మాణాలకు సంబంధించి జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లాను బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు ఆయన్ను కలెక్టరేట్‌లో సోమవారం కలిసి వినతిపత్రంతో పాటు కామధేను ప్రతిమను అందజేశారు. గృహ నిర్మాణాలపై జిల్లాలో పది పర్యాయాలు విజిలెన్స్ విచారణ జరిగినప్పటికీ చర్యలు తీసుకోలేదని, మెటీరియల్ రికవరీ చేయలేదని, నిర్మాణాలు చేపట్టలేదన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో పటిష్టమైన గృహ నిర్మాణాలు జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వరమ్మ, పొట్లూరి శ్రీనివాసులు, సృజన, పద్మ, రఘురామయ్య, సూర్యనారాయణ, నారాయణ, ఆదినారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో అంతర్గత బదిలీలు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఉద్యోగులను పరిపాలనా సౌలభ్యం కోసం అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ నందన్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్‌గా గతంలో చేస్తున్న వి.పద్మావతిని తిరిగి అదే స్థానంలో కొనసాగాలని ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే హౌసింగ్ ఫర్ ఆల్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న బాలసుబ్రహ్మణ్యాన్ని టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా, కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ ప్రోగ్రామ్ కింద పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌ను టౌన్‌ప్లానింగ్ విభాగంలో జీ–4 గుమస్తాగా నియమించారు. అదేవిధంగా టౌన్ ప్లానింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్ సందీప్‌ను కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేసి పీజీఆర్ఎస్ ప్రోగ్రామ్ కింద నియమించారు.

అమ్మణ్ణి దర్శనం.. భక్తజన పరవశం

- బహు రూపిణిగా జగన్మాత కటాక్షం
- కిటకిటలాడిన ఆలయాలు

నగరంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో మొదలయ్యాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా శక్తి స్వరూపిణిని తొమ్మిది రోజులు పూజించి, పదో రోజు జరుపుకునే దసరా పండగ రాకతో సింహపురి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నగరంలోని ఆలయాల్లో జగజ్జనని విశేషాలంకరణలో భక్తులను కటాక్షించారు.



1,008 కలశాలతో నగరోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి ఆలయంలో తొలిరోజు కలశ స్థాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి అమ్మవారు చండీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కొరిమెర్ల వెంకటేశ్వర్లు– వెంకటనాగలక్ష్మి, ముప్పరాజు సుబ్బారావు– బబిత, గుత్తా రామ్మోహన్– సరిత దంపతులు వ్యవహరించారు. ఆల్తూరు గిరీష్‌కుమార్ రెడ్డి, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జంజం శ్రీనివాసరావు, ఈఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

⇨ స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కలశ స్థాపన, ప్రాణప్రతిష్ట విశేషంగా నిర్వహించారు. రంగనాయకులపేటలోని రంగనాథస్వామి దేవస్థానం ప్రాంగణం నుంచి 1,008 మంది మహిళలు పినాకిని నది జలాన్ని కలశాలలో ఊరేగింపుగా వచ్చి కన్యకాపరమేశ్వరిని అభిషేకించారు. రాత్రి అమ్మవారు కాత్యాయని అలంకారంలో దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తికి పూలంగి సేవ, దీపాలంకరణ నిర్వహించారు. ఉభయకర్తలుగా దొంతంశెట్టి వెంకటేశ్వర్లు– సుజన, వెంకట మల్లికార్జునరావు–లక్ష్మి దంపతులు వ్యవహరించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, నిచ్చెనమెట్ల చిరంజీవి, జనార్దన్, ఆంజనేయులు, వేముల ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

⇨ మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కలశ స్థాపన నిర్వహించారు. ఉభయకర్తలుగా డి.మోహన్, కస్తూరి, జితేంద్రవర్మ, హైంద్రీ వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.

⇨ సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కోసూరు రాజశేఖర్– స్వప్న, బత్తిన కుమార్‌స్వామిరెడ్డి– లక్ష్మి దంపతులు వ్యవహరించారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత, ధర్మకర్తల మండలి చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, ఈఓ వి.గిరికృష్ణ పర్యవేక్షించారు.

⇨ సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు చండీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ధరమ్‌సింగ్–కల్పనాబాయి దంపతులు, జీసీ రాధాబాయి వ్యవహరించారు. వంశపారంపర్య ధర్మకర్త బాలాజీసింగ్, ఈఓ మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు.

⇨ ఏసీ నగర్ కోదండరామపురం మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు గాయత్రి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వాసిపల్లి నారాయణరెడ్డి– విజయమ్మ, నూతేటి వెంకటేశ్వర్లు– ఆదిలక్ష్మి, బి.శివకుమార్– వెంకటనిఖిత దంపతులు వ్యవహరించారు. దేవస్థానం కమిటీ చైర్మన్ పత్తి నరసింహం, సభ్యులు పర్యవేక్షించారు.

⇨ మెక్లిన్స్ రోడ్డు విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అమ్మవారు విజయదుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా మాధవరం మాలకొండయ్య ఆచారి, సాయి పూర్ణిమ, అంబూరు మునిరాజా ఆచారి– అనూరాధ, యు.మురళీకృష్ణ ఆచారి– తేజశ్విని, ఎస్.సుబ్బనాచారి– సుజాత దంపతులు వ్యవహరించారు.

⇨ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కలశస్థాపన నిర్వహించారు. ఉభయకర్తలుగా ఘంటసాల రేవతికుమార్– ఉషారాణి దంపతులు వ్యవహరించారు. నిర్వాహకులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కొప్పరపు శివప్రసాద్, అమరా మోహన్‌రావు పర్యవేక్షించారు.

⇨ నవాబుపేటలోని ధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వేలూరు వెంకటేశ్వర్లు–వరలక్ష్మి, సాదా వెంకటాచలం– సువర్ణ, సాదా నరసింహులు– శైలజ దంపతులు వ్యవహరించారు. నాగేంద్రకుమార్, కంచి జ్ఞానేంద్ర, ఈఓ దర్గయ్య పర్యవేక్షించారు.

⇨ మూలాపేటలోని ధర్మరాజస్వామి ఆలయంలో కలశస్థాపన నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆరంబాకం కృష్ణసింహ సోదరులు వ్యవహరించారు. ఈఓ జానకి పర్యవేక్షించారు.

వేదగిరిలో..

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆదిలక్ష్మి అమ్మవారికి విశేషాలంకరణ గావించారు. అర్చకులు మాధవగిరి భాస్కరాచార్యులు, మాధవగిరి వెంకట కృష్ణమాచార్యులు కలశ స్థాపన, విశేష కుంకుమార్చన నిర్వహించారు. ఈఓ వేమూరి గోపి పాల్గొన్నారు.

⇨ నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కలశ స్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం పల్లకిసేవ గావించారు. ఆలయ చైర్మన్ నాగిరెడ్డి– రాజేశ్వరి, వెంకయ్య– పద్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..



వేదగిరిలో..



ధర్మరాజస్వామి దేవస్థానంలో..



మహాలక్ష్మి దేవస్థానంలో..



వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో..



మహావిష్ణు ఆలయంలో..

పగటిపూట భారీ వాహనాల నిషేధం



లారీ అసోసియేషన్ నాయకులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): పగటిపూట భారీ వాహనాలకు నగరంలో ప్రవేశం లేదని నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సూచించారు. నార్త్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో స్టోన్‌హౌస్‌పేటకు చెందిన సింహపురి వాణిజ్య మండలికి చెందిన లారీ అసోసియేషన్‌తో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, పప్పులవీధి, రేబాలవీధిలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్న దృష్ట్యా భారీ వాహనాలు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 8 గంటల్లోపు లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకోవాలని ఆయన చెప్పారు. పగటిపూట భారీ వాహనాలకు ప్రవేశం లేదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డీకేడబ్ల్యూలో ఫుడ్ స్టాల్స్



నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో బయోటెక్ విభాగం ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ మెథడ్స్‌ను ఉపయోగించి విద్యార్థినులు తయారు చేసిన పలు ఆహార పదార్థాలతో స్టాల్స్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమణారావు హాజరై, మాట్లాడుతూ విద్యా నైపుణ్యాలను నేర్చుకుని ఆవిష్కరణ దిశగా అడుగులు వేయాలన్నారు. న్యాయ నిర్ణేతలుగా కరుణశ్రీ వ్యవహరించారు. అధ్యాపకులు ప్రియాంక, మహిత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33/11 కేవీ వైఎంసీఏ సబ్‌స్టేషన్ పరిధిలో నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సిబ్బందికి సహకరించాలని కోరారు.

పది గంటల పనివిధానం దారుణం

- కూటమి తీరుపై సీఐటీయూ ఆందోళన



ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కూటమి ప్రభుత్వం పది గంటల పని విధానాన్ని అమలు చేయడం దారుణమని సీఐటీయూ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆత్మకూరు బస్టాండ్ వద్ద నిర్వహించిన ర్యాలీలో సీఐటీయూ నగరాధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేశ్వరరావు మాట్లాడుతూ కొత్త చట్ట సవరణ బిల్లు కారణంగా కార్మికులు యజమానులకు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక 46 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. అయితే బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ చట్టాలు అమలు చేయకపోయినప్పటికీ ఏపీలో మాత్రం చంద్రబాబు సర్కార్ పది గంటల విధానాన్ని అమలు చేయడం ఏమిటని నిలదీశారు. దీనిని రద్దు చేయకుంటే పెద్దఎత్తున కార్మికులను సమీకరించి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు కత్తి శ్రీనివాసులు, బాబురావు, శ్రీనివాసులు, అశోక్, కామాక్షమ్మ, మూలం ప్రసాద్, మధు, నగర కమిటీ సభ్యులు సూర్యనారాయణ, పెంచలయ్య, అంకయ్య, రవీంద్ర, గడ్డం శ్రీనివాసులురెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

⇨ రూరల్ సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో వేదాయపాళెం సెంటర్ నుంచి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, పెంచల నరసయ్య మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ అనుమతితో 13 గంటలు సైతం పని చేయించుకునేందుకు కూటమి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం, మహిళలతో రాత్రి వేళల్లో పని చేయించుకునేందుకు అనుమతి ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రసాద్, శివాజీ, నరసింహారెడ్డి, కోటేశ్వరావు, దేశమూర్తి, అంకయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోకు నిప్పు

నెల్లూరు(క్రైమ్): ఆటోకు నిప్పంటించిన ఘటన జాఫర్ సాహెబ్ కాలువకట్ట వద్ద సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. జాఫర్ సాహెబ్ కాలువ కట్ట వద్ద ఆటో యజమాని వెంకటేశ్వర్లు నివాసం ఉంటున్నారు. ఆయన తన ఆటోను డేవిడ్ అనే వ్యక్తికి రోజువారీ అద్దెకు ఇచ్చారు. ఈ క్రమంలోనే వారి మధ్య మనస్పర్ధలు చోటుచేసుకోవడంతో అతన్ని వెంకటేశ్వర్లు దూరం పెట్టారు. ఈ క్రమంలో డేవిడ్ సోమవారం తెల్లవారుజామున వెంకటేశ్వర్లు ఇంటి ముందు నిలిపి ఉన్న ఆటోకు నిప్పంటించి పరారయ్యారు. ఈ ఘటనలో ఆటో పాక్షికంగా దెబ్బతింది. ఈమేరకు బాధితుడు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారానికి వినతి



కమిషనర్ నందన్‌కు అర్జీ అందజేస్తున్న కార్పొరేటర్ సత్తార్

నెల్లూరు(బారకాసు): 29వ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ షేక్.సత్తార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక పార్టీ నాయకుడు జాకీర్‌తో కలిసి ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కమిషనర్ నందన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మురుగు కాలువల్లో చెత్తా చెదారం నిండిపోవడంతో నీరు నిల్వ చేరి ముందుకు ప్రవహించడం లేదన్నారు. దీనిపై సచివాలయ శానిటరీ సెక్రటరీ కూడా సహకరించడం లేదన్నారు. ఇప్పటికే పలుచోట్ల అనేక మంది విషజ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలయ్యారని చెప్పారు. కమిషనర్ స్పందించి కాలువల్లో మురుగునీరు సాఫీగా ప్రవహించేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

టిడ్కో గృహాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(బారకాసు): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాల మంజూరుకు అర్హులైన ప్రజలందరూ దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ నందన్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ పాల్గొని, అర్జీదారుల నుంచి వినతి పత్రాలను అందుకున్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి స్థానిక సచివాలయాన్ని సందర్శించి దరఖాస్తుకు అవసరమైన పూర్తి వివరాలను పొందాలని సూచించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కాగా పీజీఆర్ఎస్ ద్వారా 46 వినతులు స్వీకరించామని వెల్లడించారు. విభాగాల వారీగా అకౌంట్స్– 2, ఇంజినీరింగ్– 6, రెవెన్యూ–2, పబ్లిక్ హెల్త్–2, హౌసింగ్–20, టౌన్ ప్లానింగ్–8, హెచ్ సెక్షన్–3, అప్కాస్–3 చొప్పున వినతులు వచ్చాయి. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్ రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

నెల్లూరు(బారకాసు): దసరా ఉత్సవాల నేపథ్యంలో రాజరాజేశ్వరి దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. స్థానిక రాజరాజేశ్వరి దేవస్థాన ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను ఆయన సోమవారం పర్యవేక్షించారు. అనంతరం 46వ డివిజన్ ముత్తరాజువారి వీధిలో కాలువల పూడికతీతపై పలు సూచనలు చేశారు. స్థానికంగా రోడ్డును ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన దుకాణ యజమానికి రూ.5 వేల అపరాధ రుసుము విధించి, వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రంకురోడ్డు అర్చన థియేటర్ నుంచి నర్తకి థియేటర్ వరకు ఉన్న కాలువలను పరిశీలించారు. స్థానిక దుకాణదారులు వ్యర్థాలను కాలువల్లో వేయకుండా డస్ట్‌బిన్లను వినియోగించాలన్నారు. ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఫౌంటైన్లను, సులబ్ కాంప్లెక్స్ నిర్వహణను తనిఖీ చేశారు. రంగనాయకులపేటలో పినాకిని పార్కు అభివృద్ధి పనులను పరిశీలించారు. జాఫర్‌సాహెబ్ కెనాల్ ప్రాంతంలో స్మార్ట్ స్ట్రీట్ బజార్ చివరి దశ పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతు జానీ, ఎంహెచ్ఓ డాక్టర్ కనకాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

- నెలలు గడిచినా పూడ్చని యూజీడీ గుంతలు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నెల్లూరు(బారకాసు): అభివృద్ధి పేరుతో చేపడుతున్న పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా సగం సగం జరిగిన ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని భగత్‌సింగ్ కాలనీ, మారుతీనగర్, శ్రీనివాసనగర్, మైపాడు రోడ్డు, పద్మారువారి వీధి తదితర ప్రాంతాల్లో భూగర్భ డ్రెయినేజీ(యూజీడీ) పనులు చేపడుతున్నారు. దీంతో పనులు జరిగే ఆయా ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే పనులు పూర్తయినా రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో రాకపోకలకు స్థానిక ప్రజలు అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. మరికొన్ని ప్రాంతాల్లో యూజీడీ పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఓ వైపు వర్షాలు కురవడంతో యూజీడీ పనుల కారణంగా గుంతలమయంగా తయారైన రోడ్లలో నీరు నిలిచిపోవడంతో బురదమయంగా మారి నడిచేందుకు కూడా వీలు లేకుండాపోతోంది. అంతేకాకుండా ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో అదుపుతప్పి పడిపోవడంతో గాయాలపాలవుతున్నారు. నెలలు గడుస్తున్నా యూజీడీ పనులు పూర్తయిన ప్రాంతాల్లోనైనా కనీసం సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టడంలో కాలయాపన చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై ప్రజారోగ్యశాఖాధికారులు స్పందిస్తూ యూజీడీ పనులు చేపట్టిన ప్రాంతాల్లో త్వరలోనే రోడ్ల నిర్మాణాలు చేపడుతామని చెబుతున్నారు.



శ్రీనివాసనగరంలో ఇదీ పరిస్థితి



మారుతీనగర్‌లో రోడ్డు వేయకపోవడంతో కొద్దిపాటి వర్షానికే అధ్వానంగా మారిన రోడ్డు

నిత్యం ప్రమాదాలు



శ్రీనివాసనగర్ రెండో వీధిలో బైక్‌పై వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది. భూగర్భ డ్రెయినేజీ పనులతో రోడ్డు అధ్వానంగా తయారైంది. ఎక్కడ పడిపోతామో అర్థం కావడం లేదు. వర్షం వస్తే బురదమయం అవుతోంది.

– రమణారెడ్డి, సత్యనారాయణపురం

త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలి



మారుతీనగర్ మొదటి వీధి రోడ్డు అధ్వానంగా ఉంది. యూజీడీ పనులు పూర్తి చేసినా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. దీంతో వర్షం కురిసిన సమయంలో గుంతలమయంగా ఉన్న రోడ్డులో నీరు నిల్వ చేరడంతో రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీలైనంత త్వరగా రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– షాజహాన్, న్యూ కాలనీ, జాకీర్‌హుస్సేన్ నగర్